రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





## 12లోగా రెడీ..
### శరవేగంగా ముస్తాబవుతున్న ఖైరతాబాద్ గణనాథుడు ముస్తాబు

ఖైరతాబాద్ బడా గణేశుడి విగ్రహ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది పంచముఖ సంకటహర మహా గణపతిగా 69 అడుగుల భారీ విగ్రహం రూపుదిద్దుకొంటుంది. 12వ తేదీలోగా పెయింటింగ్ పను లు పూర్తిచేస్తామని ఉత్సవ కమిటీ కన్వినర్ సందీప్‌రాజ్ ముదిరాజ్ తెలిపారు.

# ఇరుకిరుకు వేదిక..
# చాలీచాలక అరిగోస!

- స్పీకర్ పర్యటన ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, లబ్ధిదారులు
- చాలీచాలని రైతువేదిక భవనంలో సమావేశం
- కుర్చీలు చాలక, ఆరుబయటే నిలువుకాళ్ల జీతం
- నిరాశలో నాయకులు, కార్యకర్తలు

**ధారూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ధారూర్ మండలంలో తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటనలు, అధికారిక సమీక్షా సమావేశాలు తీవ్ర గందరగోళం మధ్య సాగుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలతో పాటు వ్యవసాయ శాఖ, మండల అభివృద్ధిపై నిర్వహించే కీలక సమావేశాలకు తగిన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలోని



ఇరుకుగా ఉన్న రైతువేదికలో స్పీకర్ అధికారిక కార్యక్రమ దృశ్యం



రైతు వేదికలో ఈ సమావేశాలను ఏర్పాటు చేస్తుండడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.
శాసనసభాపతి లాంటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి వస్తున్నారంటే తదనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అయితే, ధారూర్ మండలంలో జరుగుతున్న తీరు ఇందుకు విరుద్ధంగా ఉంది. స్పీకర్ పై ఉన్న అభిమానంతో మండలంలోని నలుమూలల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తరలివస్తున్నారు. కానీ, వారు కూర్చోవడానికి సరిపడా స్థలం గానీ, కనీసం కుర్చీలు గానీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద హోదా కలిగిన స్పీకర్ వెంట భద్రతా సిబ్బంది, గన్‌మెన్‌లు రావడం సహజం. అయితే వారిద్దరికే వేదికపై స్థలం సరిపోని దుస్థితి నెలకొంది. ఇక సమావేశానికి వచ్చిన సామాన్య కార్యకర్తలు, లబ్ధిదారులు ఎండలో బయటే నిలబడి, కిటికీల గుండా చూస్తూ వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సమావేశ వేదికపై కనీసం ఫొటో దిగే అవకాశం కూడా దక్కకపోవడంతో పార్టీ శ్రేణులు, నాయకులు తీవ్ర నిరాశకు, అసహనానికి గురవుతున్నారు. అధికారుల ముందస్తు అంచనాల లోపం, నిర్లక్ష్య ధోరణి వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది.
శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్
ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ ఇబ్బందులు వస్తున్నాయని మండల ప్రజలు, పార్టీ కార్యకర్తలు బహిరంగంగానే గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందించి, స్పీకర్ లేదా ఇతర ప్రముఖుల పర్యటనలు ఉన్నప్పుడు తగినంత స్థలం, వసతులు ఉన్న విశాలమైన ప్రభుత్వ వేదికలను ఎంపిక చేయాలని కోరుతున్నారు.

## ప్రజావాణికి బాధితుల క్యూ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

**మేడ్చల్/వికారాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారం కోసం మేడ్చల్, వికారాబాద్ జిల్లాల కలెక్టరేట్లకు అర్జీదారులు పోటెత్తారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆయా జిల్లాల యంత్రాంగం ఆదేశించింది. మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా డిఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి ప్రజల నుంచి 86 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా విద్యాశాఖకు సంబంధించి 20, ఈసెక్షన్ భూసమస్యలపై 16, డిసెక్షన్ భూసమస్యలపై 15 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన ప్రజావాణిలో 110 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, డీఆర్ఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దర ఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులు స్పష్టం చేశారు.



# తెల్ల బంగారానికి.. మాయదారి రోగం!

- మాడిపోతున్న పత్తి పైరు
- వర్షాభావానికి తోడు తెగుళ్ల బెడదతో తీవ్ర సంక్షోభం
- ఎకరానికి రూ. 25 వేల వరకు నష్టం
- జాడలేని వ్యవసాయ శాఖ సిబ్బంది
- పరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్



పూడూరు మండలం కద్మూరులో ఎర్రబారిన పత్తిపంట

**పూడూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త :** దేశానికి వెన్నెముక కిసాన్.. కాపాడేది జవాన్.. అనే నానుడి కాగితాలకే పరిమితమవుతోంది. ఆరుగాలం కష్టపడి పంట పండించే అన్నదాతకు వాతావరణం సహకరించక, అధికారుల ఆదరణ కరువై, చివరకు వింత తెగుళ్ల రూపంలో అష్టకష్టాలు ఎదురవుతున్నాయి. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో ఎలినినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతోపాటు, పంటలకు సోకిన అజ్ఞాత రోగం పత్తి రైతుల పొట్ట కొడుతోంది.

**వర్షాభావంతో మూడు దశల్లో మొలకలు**

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన భారీ వర్షాలను చూసి రైతులు ఆశగా విత్తనాలు విత్తుకున్నారు. మండలంలోని 32 గ్రామపంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో కలిపి సుమారు 20 వేల ఎకరాల్లో పత్తి, ఏడు వేల ఎకరాల్లో మొక్కజొన్న, 1,300 ఎకరాల్లో కందులు, 900 ఎకరాల్లో వరి పంటలను రైతులు సాగు చేశారు. సొంత సొమ్ము, సొంత ఎద్దులు ఉన్న రైతులు పొలంలో తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయగా, కిరాయి ట్రాక్టర్లు, ఎద్దులపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులు మూడు నుండి నాలుగు రోజులు ఆలస్యంగా విత్తనాలు విత్తారు. అయితే తొలకరి వర్షాల తర్వాత సుదీర్ఘకాలం పాటు చినుకు కూడా రాలకపోవడంతో ఒకే పొలంలో విత్తిన విత్తనాలు మూడు వేర్వేరు దశల్లో మొలకెత్తి పంట ఎదుగుదలను దెబ్బతీశాయి. జులై చివరిలో కురిసిన వర్షానికి కాస్త జీవం వచ్చినట్లు కనిపించినా, ఆగస్టు నెల ముగిసేసరికి మళ్లీ వర్షాభావం నెలకొనడంతో భూమి నెర్రెలు బారుతోంది.

**మాడి మసైపోతున్న పత్తి తోటలు**

వర్ష లేమి ఒకెత్తయితే, ప్రస్తుతం మండల పరిధిలోని కద్మూరు, మిట్టకంకల్ గ్రామాలతో పాటు పొరుగునే ఉన్న రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బొబ్బిలిగాం శివారులోని పత్తి పొలాల్లో వింత తెగులు తాండవిస్తోంది. పత్తి మొక్క ఆకులు ఎర్రబారి, ఎదుగుదల ఆగిపోయి చూస్తుండగానే ఎండిపోతున్నాయి.

**క్రిమిసంహారక మందులు వాడినా ఫలితం శూన్యం**

తెగులు నివారణకు రైతులు అప్పులు చేసి వేల రూపాయల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా పంట ఎంతమాత్రం కోలుకోవడం లేదు. అటు మొక్కజొన్న పంట కూడా గింజ తొడిగే సమయానికి భూమిలో తేమ లేకపోవడంతో గింజ నాణ్యత తగ్గి దిగుబడి దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది.

**పెట్టుబడి అంతా వృథా**

ఎకరానికి విత్తనాలు, దుక్కి దున్నడం, ఎరువులు, కూలీల ఖర్చుల రూపంలో ఇప్పటికే రూ. 20,000 నుండి రూ. 25,000 వరకు పెట్టుబడి పెట్టారు.

**వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం**

పంటలు చేతికి రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని పూడూరు ప్రాంత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్షోభ సమయంలో సకాలంలో ఎరువులు అందించడంలోను, ఏ రకమైన మందులు వాడాలో సలహాలు, సూచనలు ఇవ్వడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి తెగుళ్లను పరిశీలించి, తగిన యాజమాన్య పద్ధతులను సూచించడంతో పాటు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం మొక్కజొన్న బుట్టకు గింజలు పట్టేసమయం కావడంతో వర్షాభావంవల్ల భూమిలో తేమలేక గింజల్లో నాణ్యతతగ్గే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మేడ్చల్ జిల్లా ఉల్లాస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌పిలు

# ఉల్లాస్ శభాష్

- మేడ్చల్ టీం అక్షర యజ్ఞానికి జాతీయ గుర్తింపు
- విద్యా వాలంటీర్ల కృషికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రశంస
- 100 అక్షరాస్యతే లక్ష్యంగా జిల్లా అధికారుల అడుగులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో నిర్వహించిన ఉల్లాస్ వయోజన విద్యా కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. జిల్లాలో చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణను గుర్తించిన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, వాటికి సంబంధించిన వివరాలతో కూడిన వ్యాసాన్ని కోరి మరీ తమ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ప్రచురించింది. ఇది జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని అధికారులు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మార్గదర్శకత్వంలో, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ కే. అనితతోపాటు సంబంధిత అధికారుల నేతృత్వంలో ఈ విజయం సాధ్యమైంది. సైబరాబాద్, మల్కాజ్‌గిరి, జిహెచ్‌ఎంసి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని అన్ని మున్సిపల్ సర్కిళ్లలో రిసోర్స్ పర్సన్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, అక్షరాస్యత లేని వారిని గుర్తించి వారికి ఉల్లాస్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విస్తృత అవగాహన కల్పించారు. స్వచ్ఛంద ఉపాధ్యాయుల (వాలంటీర్లు) సహకారంతో పెద్ద ఎత్తున అభ్యాసకులను నమోదు చేయడం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని గణనీయంగా పెంచగలిగారు. ఈ జాతీయ గుర్తింపు తమ బృందంలో మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను పెంచిందని, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాను రాష్ట్రంలోనే 100 శాతం అక్షరాస్యత కలిగిన మొదటి జిల్లాగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## బకాయిలు చెల్లించలేదని
# ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తాళం



మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తాళం వేస్తున్న భవన యజమాని

**మేడ్చల్, ఆగస్టు 31. ప్రభాతవార్త :** ప్రభుత్వ శాఖల నిర్లక్ష్య వైఖరిపై ఓ భవన యజమాని నిరసన తెలిపిన సంఘటన మేడ్చల్ పట్టణంలో తీవ్ర సంచలనం సృష్టించింది. మూడేండ్లుగా భవన అద్దె చెల్లించకపోవడంతో మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయానికి (పోలీస్ స్టేషన్) భవన యజమాని విఠల్ రెడ్డి సోమవారం తాళం వేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నిర్వహణ కోసం 2011లో ఓ ప్రైవేట్ భవనాన్ని ఎక్సైజ్ శాఖ అద్దెకు తీసుకుంది. ప్రారంభంలో కొన్ని సంవత్సరాల పాటు అద్దె క్రమం తప్పకుండా చెల్లించినప్పటికీ, ఆ తర్వాత తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. గత మూడేండ్లుగా అసలు అద్దె బకాయిలను చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**భవనం దెబ్బతిన్నా పట్టించుకోలేదు**

అద్దె చెల్లించకపోవడమే కాకుండా కార్యాలయ నిర్వహణను కూడా తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని యజమాని ఆరోపించారు. భవనం పైన ఎక్సైజ్ శాఖకు చెందిన వాహనాలు, ఇతర సామాగ్రిని ఇష్టారీతిన ఉంచడంతో స్లాబు తీవ్రంగా దెబ్బతిన్నదని, దాని మరమ్మతులు కూడా చేయించలేదని వాపోయారు.

**చెప్పులు అరిగేలా తిరిగా : భవన యజమాని విఠల్ రెడ్డి**

"బకాయి అద్దె చెల్లించాలని మూడేండ్లుగా అధికారుల చుట్టూ కాళ్ల రిగేలా తిరిగాను.
ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత అధి కారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. సామాన్యులకు ఇబ్బంది కలిగితే ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్రయిస్తారు, మరి ప్రభుత్వ సంస్థలే అద్దెలు ఎగ్గొట్టి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటి?" అని యజమాని విఠల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పోలీస్ స్టేషన్‌కే యజ మాని తాళం వేసిన వ్యవహారం స్థానికంగా చర్చనీ యాంశంగా మారింది.



శిథిలావస్థలో ఉన్న రాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

## పాఠశాలలో
# పాము కలకలం

- ★ భయంతో పరుగులు తీసిన విద్యార్థులు
- ★ శిథిలమవుతున్న భవనాల మధ్యే చదువులు
- ★ తరగతి గదులలో విష కీటకాల సంచారం
- ★ విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని సర్పంచ్ ఆగ్రహం

**తలకొండపల్లి ఆగస్టు 31, ప్రభాతవార్త :** విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాల మీదికి తెస్తోంది. మండల ఎంఈఓ పర్యవేక్షణ కరువై, పాఠశాల భవనాలు పాడుబడిపోతుండటంతో విద్యార్థులు భయం గుప్పెట్లోనే చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నాడు తరగతి గదిలోకి ఒక్కసారిగా పాము రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. పాఠశాల భవనాలు తీవ్రంగా దెబ్బతిని, శిథిలావస్థకు చేరుకోవడం వల్లే తరచూ పాములు, తేళ్లు లోపలికి ప్రవేశిస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ పాఠశాలను సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు.

**పాడుబడిన భవనాలు ఎంతకాలం?**

ఆవరణతో పాటు మధ్యాహ్న భోజనశాలను పరిశీలించి, భయాందోళనలో ఉన్న విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పాడుబడిన భవనాల వల్ల విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొత్త భవనానికి నిధులివ్వండి**

నూతన భవనాల మంజూరు కోసం ఎంఈఓకు, ఇతర అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం వల్లే మండలంలో అనేక పాఠశాలల్లో ఇలాంటి దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రాంపూర్ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాలు మంజూరు చేసి, విద్యార్థులకు రక్షణ కల్పించాలని సర్పంచ్‌తో పాటు హెచ్‌ఎం పావని, అంగన్‌వాడీ టీచర్ పద్మ, గ్రామస్తులు లక్ష్మీదేవి, సునీత, నాగమణి తదితరులు డిమాండ్ చేశారు.

# జిహెచ్‌ఎంసిలకు కొత్త లోగోలు
### ఆవిష్కరించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)ల కొత్త లోగోలు వచ్చాయి. ఈమేరకు సోమవారం మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవం అనంతరం అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన సభలో మూడు కార్పొరేషన్ల లోగోలను సిఎం రేవంత్ ఆవిష్కరించారు. కాగా గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించడంతో పాటు ఓస్పెషలాఫీసర్, మరో ఇద్దరు కమిషనర్లను నియమించిన సంగతి తెలిసిందే. పాత జీహెచ్‌ఎంసీలో ఆరు జోన్లు, మూడు జోన్లతో సైబరాబాద్, మూడు మల్కాజి గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ మహానగరం చుట్టూరా 158 కి.మీ పరిధిలో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి భూభాగాన్ని కోర్ అర్బన్ రీజియన్ (క్యూ ర్)గా మారుస్తూ పాత జీహెచ్‌ఎంసీని పునర్వి భజన చేసింది. 6 జోన్లతో జీహెచ్‌ఎంసీ జీహెచ్ ఎంసీని సుమారు 70 లక్షల జనాభాతో కూడిన ఆరు జోన్లకు పరిమితం చేయగా సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లలో సగటున 35 లక్షల జనాభా ఉండేటట్లుగా మూడు జోన్ల చొప్పున వి భజించారు. జీహెచ్‌ఎంసీలో శంషాబాద్, రాజేం ద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ జోన్లు, 30 సర్కిల్స్, 150 డివిజ న్లు ఉంటాయి. ప్రస్తుతం 689 చదరపు కిలో మీటర్లకు జీహెచ్‌ఎంసీ పరిమితమైంది. కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్‌నే కొనసాగించింది. సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లున్నాయి. మొదటి కమిషనర్‌గా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్, ఐఏఎస్ ఆఫీసర్ సృజనను నియమించింది.

**మల్కాజిగిరిలోనూ మూడే**

..మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లో మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్లు ఉన్నా యి. ఇందులో కొత్తగా ఏర్పాటు చేసిన 14 సర్కి ల్స్, 74 డివిజన్లు ఉన్నాయి. ఈకార్పొరేషన్ 654 చ.కి విస్తీర్ణంతో ఏర్పడింది. మొట్టమొదటి కమిషనర్‌గా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్, ఐఏఎస్ ఆఫీసర్ 2013 బ్యాచ్‌కు చెందిన టి. వినయ్ కృష్ణారెడ్డి ఉన్నారు.

# కిలేడీ ఆటకట్..
### ఒంటరి మహిళలే టార్గెట్‌గా చోరీలు..
## అంతరాష్ట్ర మహిళా దొంగను పట్టుకున్న సిసిఎస్ పోలీసులు




వివరాలు వెల్లడిస్తున్న సిసిఎస్ సిఐ బల్వంత్‌రాయ్

**వికారాబాద్, ప్రభాతవార్త :** చోర కళలో ఆరితేరిన ఓ మహిళా దొంగను వికారాబాద్ జిల్లా సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఒంటరి మహిళను లక్ష్యంగా చేసుకుని, వారితో కలుపుగోలుగా ముచ్చటించి, వారిని మాటల్లో దింపి మహిళల మెడలోని నెక్లెస్, ఇతరత్ర బంగారు ఆభరణాలను చమత్కారంగా తస్కరించేంది. చోర కళలో ఆరితేరిన మహిళా దొంగను వికారాబాద్ జిల్లా సీసీఎస్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్ సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని సోలాపూర్ భీమ్‌నగర్ లష్కర్ ఉత్తర్ సదర్ బజార్ ప్రాంతానికి చెందిన లక్ష్మీ అసాడే అనే మహిళా నిందితురాలు వరుస దొంగతనాలకు పాల్పడేది. ఎవరు అనుమానించకుండా ఉండేందుకు ఒంటరి మహిళలైన వృద్ధులు, వితంతువులు, ఇతర ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడేదని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్ తెలిపారు. తతాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా దొంగతనాలు కావడంతో, సాంకేతిక ఆధారాలు, నేరం జరిగిన ప్రాంతాలు, బాధితుల వివరాలు, నిందితురాలి కదలికలు, నేరం జరిగిన విధానాన్ని విశ్లేషించి సీసీఎస్ పోలీసులు నిందితురాలు లక్ష్మీని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. దీంతో తాండూరులో 9.5 తులాలు బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు నింధితురాలు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. కర్ణాటకలో మరో 3 కేసులు, కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ టౌన్ పీఎస్ పరిధిలో 2 కేసులు, నవనగర్ పీఎస్ పరిధిలో 1 కేసు, ఇదే తరహాలో జరిగినట్లు విచారణలో వెల్లడించినట్లు సీఐ తెలిపారు.
తాండూరు, కర్ణాటకలోని దొంగతనం కేసుల్లో మొత్తం 24 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించనట్లు నింది తురాలు పేర్కొన్నట్లు సీఐ వివరాలు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు సమర్థ వంతంగా చేధించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, తాండూరు టౌన్ ఎస్ఐ మమత, హెడ్‌కానిస్టేబుల్ జయవర్ధన్, శివకుమార్, పీసీలు రామ కృష్ణ, సాయప్ప, శివరాజ్, పాండు, రాజు, రవీందర్, డబ్ల్యూపీసీ గాయత్రిలను జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా అభినందించినట్లు సీఐ తెలిపారు.

## చారిత్రక చెరువుకు మురుగు నీటి పోటు

- అపార్ట్‌మెంట్లలో వ్యర్థాలను మళ్లించటానికి అక్రమ డ్రైనేజీ నిర్మాణం
- సాగు, తాగునీరు పూర్తిగా కలుషితం
- జాతీయ రహదారి మీదుగా సాగుతున్న అక్రమ తవ్వకాలు
- మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన కొత్తూరు రైతులు
- జీవనాధారాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదని ఆందోళన

**కొత్తూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:** తమ జీవితాలకు ఆధారం, ప్రాంతానికే తలమానికమైన చారిత్రాత్మక కాసనకుంట చెరువు ఉనికి ప్రమాదంలో పడిందని కొత్తూరు రైతులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువును రక్షించాలని డిమాండ్ చేస్తూ కొత్తూరు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.



మురుగునీరు మళ్లించటానికి నిర్మిస్తున్న డ్రెయిన్

చాకలివారి గొట్ట దండ (సీజీ దండ) పంచాయతీ పరిధిలోని అయ్యప్పస్వామి గుడి సమీప కాలనీలు, అపార్ట్‌మెంట్ల నుంచి వస్తున్న మురుగు నీటిని, వృథా నీటిని నేరుగా కాసనకుంట చెరువులోకి మళ్లించేందుకు అక్రమంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారని గ్రామీణులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణం ఏకంగా ఎన్‌హెచ్ 44 (మీర్ గుండా దర్గా సమీపం) మీదుగా కొనసాగుతుండటం గమనార్హం. మురుగునీరు చెరువులోకి చేరితే నీరు పూర్తిగా కలుషితమై, వ్యవసాయానికి మాత్రమే కాకుండా తాగునీటికి కూడా పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తమ జీవితాలు, పంటలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. తక్షణమే డ్రైనేజీ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు.



ప్రధానోపాధ్యాయులు శ్రీశైలంను సన్మానిస్తున్న దృశ్యం

## శ్రీశైలం మాస్టారి సేవలు అభినందనీయం

**కేశంపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేశంపేట తాజా మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం శ్రీశైలంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినంద నీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, శ్రీశైలం గారు భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు, పాఠశాలఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయ కులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్యను సన్మానిస్తున్న తాసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు

## భూ సర్వేలో చైన్‌మెన్ మల్లయ్య కీలక పాత్ర

**పూడూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త :** మండల ప్రజలకు చైన్‌మెన్ కావలి మల్లయ్య చేసిన సేవలు అమోఘమని తహసిల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చైన్‌మెన్ మల్లయ్య పదవిరమణ సందర్భంగా పూడూరు తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీవిరమణ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన భూమి సర్వేలలో చైన్‌మెన్ మల్లయ్య కీలకపాత్ర పోషించారని వివరించారు. ఉద్యోగరీత్యా ప్రజా సేవ చేసిన మల్లయ్య మిగతా జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపాలని అన్నారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ కార్యాలయ సిబ్బందితోపాటు కుటుంబ సభ్యులు పదవిరమణ పొందిన మల్లయ్యను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరేశం, ఆర్ఐ సుదర్శన్, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శులు పెంటయ్య, అజీమ్‌పటేల్, నాయకులు పాండు, బాబు, జంగయ్య, పలువురు జీపిఓలు, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ నూతన ఎస్ఐగా తేజశ్రీ బాధ్యతలు

**షాద్‌నగర్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా తేజశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం, మహిళలు మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని నూతన ఎస్ఐ తేజశ్రీ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని ఆమె పేర్కొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

## చెత్త చెడిపోకుండా చర్యలు చేపట్టండి

### -ఎంఎంసీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

**హైదరాబాద్ ఆగస్టు ఆగస్టు 31 ప్రభాతవార్త :**

ఫతేనగర్–శివాలయం రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, రోడ్డు మార్జిన్లు, ట్రాఫిక్ రాకపోకలు, పౌర మౌలిక వసతులను మల్కా జ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన, సెకండరీ చెత్త సేకరణ కేంద్రాల నుంచి ప్రతిరోజూ చెత్తను తరలించాలని రామ్‌కీ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి 100 శాతం రోజువారీ డోర్‌టు డోర్ చెత్త సేకరణ జరిగేలా చూడాలని ఏఈ (ఎస్‌డబ్ల్యూఎం)కు సూచించారు. రోడ్డు మార్జిన్లలో పేరుకుపోయిన అనవసర వస్తు వులు, సామగ్రి, ఇసుకను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాలను పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను (సీ అండ్ డీ) వెంటనే తొలగించి, అధీకృత విధానంలో తరలించి ప్రాసెసింగ్‌కు పంపాలని ఆదేశం చారు. ప్రజా రహదారులను ఆక్రమించే అనధికార నిర్మాణాలు, ఇతర అడ్డంకులను నిబంధనల మేరకు తొలగించాలని సూచించారు. పారిశుద్ధం, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్ మెంట్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్పులు కనిపించేలా చర్యలు చేపట్టాలని కమి షనర్ తెలిపారు. పరిశుభ్రమైన రహదారులు, చెత్త రహిత పరిసరాలు, అవరోధాలు లేని రోడ్డు మార్జిన్లు, మెరుగైన ట్రాఫిక్ ప్రవాహానికి ప్రాధా న్యం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలో డి ప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీ ర్, ఏసీపీ, ఏఈ (ఎస్‌డబ్ల్యూఎం), డీపీఓ, రామ్ కీ, ఈపీటీఆర్ఐ ప్రతినిధులు, సంబంధిత అధి కారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో 15 దరఖాస్తులు:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో 15 దరఖాస్తులను ఆధికారులు స్వీకరించారు. వివిధ పౌర సమస్యలు, మౌలిక వసతులపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత విభాగాలకు పంపి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఇందు లో ఇంజినీరింగ్ విభాగానికి 3, టౌన్ ప్లానింగ్‌కు 9, హార్టికల్చర్ (యూబీడీ)కు 2, ఎఫ్.ఏ. విభాగా నికి ఒక దరఖాస్తు అందాయి. ప్రజల సమస్యలపై వేగంగా స్పందించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## హైదర్షాకోట్‌లో ఐదు బైక్‌లు దగ్ధం

**నార్సింగి, ఆగస్టు 31 ప్రభాతవార్త :** గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామంలో సోమవారం తెల్లవారు ఝామున ఓ ఇంట్లో పార్కింగ్ చేసిన 5బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని సాయిహర్ష కాలనీలో పర్వీన్ ఇళ్లు ఉంది. ఈమె ఈ ఇంటిని అద్దెకు ఇచ్చి హైదరాబాద్ సిటీలో ఉంటుంది. సోమవారం తెల్లవారు ఝామున 4.గంటల ప్రాంతంలో పర్వీన్ ఇంట్లో పార్కింగ్ చేసిన ఐదు బైక్‌లు తగలబడి, పెద్ద ఎత్తున మంటలు, పొగలు వచ్చాయి. గాడ నిద్రలో ఉన్న వాచ్‌మెన్ దుర్గా ప్రసాద్ ఊపిరి ఆడక నిద్రనుంచి లేచి చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే తన భార్యను తీసుకొని అతి కష్టమ్మీ ద ఇంట్లో నుంచి బయట పడ్డాడు. ఈ మంటల దాటికి ఐదు బైక్‌లు పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. ఇళ్లు పాక్షికంగా ధ్వంసం అయ్యింది. ఇంట్లో కరెం టు వైర్లు కాలిపోయాయి. దీంతో ఇంట్లో ఉన్న వారంతా ఇబ్బంది పడ్డారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**తలకొండపల్లి ఆగస్టు 31, ప్రభాతవార్త :** కల్వకుర్తి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో 3.5 కోట్ల రూపాయలతో నిర్మించే పలు బీటీ రోడ్ల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కదారి శేఖర్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. జూలపల్లి గ్రామం నుంచి చుక్కగుట్ట తండాకు 1.10 కోట్ల రూపాయలుతో రహదారి పనులు, జూలపల్లి నుంచి చంద్రధన రోడ్డుకు 2.40 కోట్లు రూపాయలు తొలగించి బీటీ రోడ్డు పనులను ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నారాయణరెడ్డి మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రవాణా సౌకర్యం మెరుగు పరుచనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాలలోని అభివృద్ధి పనులకు అధిక నిధులు తీసుకొచ్చి సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంజూరైన బిటి రోడ్డు పనులను త్వరితగతి నా పూర్తి చేసి గ్రామ ప్రజలకు సౌకర్యవంతం కల్పించాలని సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కదారి శేఖర్ యాదవ్ ఉపసర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్ శ్రీశైలం జగదీష్ గౌడ్, భగవాన్ రెడ్డి రాజు నాయక్, శ్రీశైలం లస్కర్ అల్లాజిగౌడ్ సుమిత్ర శోభ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

## ప్రభుత్వ పథకాలపై అపోహలు వద్దు..

**షాద్‌నగర్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** పనిపాటా లేని ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, ప్రభుత్వ పథకాలు అన్ని కూడా అమలు అవుతాయని ఎట్టి పరిస్థితుల్లో ఆగవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 150 మంది లబ్ధిదారులకు రూ. 50 లక్షల లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి మ్మ, షాదీముబారక్, సీఎం సహాయనిది చెక్కులను ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని అన్నారు. ప్రతిపక్షాలు కావాలని ప్రజలను తప్పుతో పట్టించి అధికార పార్టీని బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల నిర్వహణలో లోపాలు గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని అలాంటి లోపాలకు అతీతంగా పథకాలను చట్టబద్ధంగా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి మంచి మంచి పథకాలను రూపొందించారని, వాటిని అమలులోకి తెచ్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్‌లతో కలిసి ఆయన చెక్కులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు మురళీమోహన్ (అప్పి), కొప్పునూరు ప్రవీణ్, జమ్రుద్ ఖాన్, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**షాద్‌నగర్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** ప్రముఖ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల (మహిళలు), షాద్‌నగర్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థినుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, జట్టు భావన, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఉద్దేశంతో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థినుల కోసం ఖోఖో, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను మూడు సంవత్సరాల విద్యార్థినులకు నిర్వహించారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కళాశాల క్రీడా మైదానంలో సెమీఫైనల్స్, ఫైనల్స్‌ను కూడా నిర్వహించి, విద్యార్థినులు తమ క్రీడా ప్రతిభను, పోటీతత్వాన్ని ప్రదర్శించేలా అవకాశం కల్పించారు. ఈ క్రీడా పోటీలు ఎన్ఎస్ఎస్ చైర్మన్ డా. ఏ. నీతా పోల్ మార్గదర్శకత్వంలో నిర్వహించబడ్డాయి. పోటీల అనంతరం విజేతలు, రన్నరప్‌లను ప్రకటించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. నిత్యం శారీరక వ్యాయామం, క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఐకమత్యం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. క్రీడా పోటీలను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు అఫ్రోజ్ జహన్, సయ్యద్ ముంతాజ్, వి. అనిత విజయవంతంగా నిర్వహించారు.



ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న నేతలు

## పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం

**కుల్కచర్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని పిఎసిఎస్ ఛైర్మన్ భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, అన్నారు. మండల కేంద్రంలోని మంగళి లావణ్య ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని సోమవారం గృహ ప్రవేశం నిర్వహించారు. ఈ గృహప్రవేశానికి స్థానిక నాయకులు వారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహ ప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామకష్ణనాయక్, బ్లాక్‌బి అధ్యక్షులు భరత్‌కుమార్, సినియర్ నాయకులు కృష్ణరెడ్డి, వార్డు సభ్యులు వెంకటేష్, కొమ్ము శ్రీనివాస్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

## బిఆర్ఎస్ నేత రాంరెడ్డికి పరామర్శ

**కుల్కచర్ల, ఆగస్టు 2 ప్రభాతవార్త:** బిఆర్ఎసి మండల అధ్యక్షులు శేరి రాంరెడ్డి మాతృమూర్తి శేరి పద్మమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి మాజి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించించారు. ఈ కార్యక్రమంలో చౌడపూర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు మాలే కృష్ణయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాక

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31, ప్రభాతవార్త :** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు మంగళవారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమల, ఐటి శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విచ్చేస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. మంగళవారం ఉదయం 10.30గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విచ్చేస్తున్నారు. మైనార్టీ ఇందిరమ్మ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతున్నందున మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, మైనార్టీ మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తారని సంబంధిత జిల్లా అధికారులు పేర్కొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుతూ పండగ చేసుకుందాం

**ఎల్.బి.నగర్ ఆగస్టు 31 ప్రభాతవార్త:**

లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ఆశయానికి అను గుణంగా ముందుకు సాగడంతో పాటు పర్యా వరణ పరిరక్షణను కాపాడుతూ ఉత్సవాలు జరు పుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచిం చారు. గణేష్ నిమజ్జన ఉత్సవ నిర్వహణ సమన్వ య సమావేశం కార్యక్రమం సోమవారం రాత్రి నాగోల్ పిఎంఆర్ గార్డెన్స్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం జరగాలి చెరు వులు శుద్ధిగా ఉండాలని, నిమజ్జనానికి ఎటువంటి ఆటకాలు కలగకుండా కార్యక్రమాలు జరుపుకో వాలన్నారు. ప్రతి చెరువు వద్ద హైడ్రా టీం అందుబాటులో ఉంటుందన్నారు. 117 ఎకరాల కాప్రా చెరువు ఇప్పుడు 83 మాత్రమే ఉందన్నా రు. చెరువుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రకృతిని కాపాడుతున్నామన్నారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి మాట్లాడుతూ చెరువులలో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించే వి ధంగా మున్సిపల్ అధికారులు చరవ తీసుకోవాల న్నారు. నివాసాలు, అపార్ట్మెంట్ వాసులు స్థానికం గానే నిమజ్జనం చేయాలని సూచించారు. ఐదు ఫీట్ల పైన ఉన్న గణేష్ విగ్రహాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయిం చుకోవాలన్నారు. నిమర్జనం సమయంలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లను చేస్తామన్నారు. అన్ని ప్రబుత్వ శాఖల సమన్వయంతో గణేష్ ఉత్సవాల నిర్వహణకు ప ని చేస్తామన్నారు. నిమజ్జన కమిటీ సలహాలు, సూచనలను కూడా పరిగణలోకి తీసుకొని పనిచే స్తాము. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, ఎల్బీనగర్, ఉప్పల్ జోనల్ కమిషనర్లు వికాస్ మహతో, రాధిక గుప్తా, డిసిపి అనురాధ, రాహుల్ రెడ్డి, ఏసీపి కాశిరెడ్డి, రోడ్ సేఫ్టీ డిసిపి లక్ష్మి, ఉమెన్ సేఫ్టీ డిసిపి ఉషారాణి, వీహె చ్పీ, హిందూ వాహిని, గణేష్ మండప ఉత్సవ కమిటీ రాజ్ సింగ్ పూరీ, డాక్టర్ శశిధర్, సహచ రీనిలు తదితరులు పాల్గొన్నారు/



మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్




**-గ్రేటర్‌లో 'డబుల్ 'లబ్ధిదారులకు షాక్..**
**-అద్దెకిచ్చినా..ఇంటికి తాళం వేసినా హౌసింగ్ శాఖ స్వాధీనం**
**-జిల్లాలో 3900మంది లబ్ధిదారులకు నోటీసులు**
**-స్వాధీనం చేసుకుని వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నవారికి ఇచ్చేలా ప్లాన్**

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించకుండా ఖాళీగా ఉంచుతున్న లబ్ధిదారులపై హౌసింగ్ కార్పొరేషన్ చర్యలకు సిద్ధమైంది. హైదరాబాద్ జిల్లాలోని 16 ప్రాంతాల్లో 3900 మందికి రెండోసారి నోటీసులు జారీ చేసింది. నిర్దేశిత గడువులోగా ఇళ్లలోకి మారకపోతే కేటాయింపులు రద్దు చేసి, ఇళ్లను స్వాధీనం చేసుకుని వెయిటింగ్ లిస్ట్‌లోని అర్హులైన పేదలకు కేటాయించనున్నారు. గ్రేటర్ పరిధిలో 10 వేల నుంచి 15 వేల ఇళ్లు ఖాళీగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించకుండా తాళాలు వేసి ఉంచుతున్న లబ్ధిదారులకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఇళ్లలోకి వెళ్లని వారికి తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. కేటాయించిన ఇంట్లో తప్పనిసరిగా నివసించాలని.. లేకపోతే కేటాయింపును రద్దు చేసి ఇంటిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. క్యూఆర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో ఈ సమస్యను గుర్తించారు. ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోని 16 ప్రాంతాల్లో ఇళ్లు పొంది కూడా నివాసం ఉండని 3900 మంది లబ్ధిదారులకు రెండోసారి నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. నోటీసులకు స్పందించకపోతే ఇళ్లను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు కేటాయించేందుకు చర్యలు చేపట్టనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని గత ప్రభుత్వం భారీ ప్రాజెక్టులు చేపట్టింది. ఇందుకోసం సుమారు రూ. 9100 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు దాదాపు 60 వేల ఇళ్లు పూర్తయ్యాయి. పూర్తయిన ఇళ్లకు దశలవారీగా డ్రాలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు అందించారు. అయితే ఇళ్లు పొందిన వారిలో కొందరు వాటిని వినియోగించకుండా తాళాలు వేసి వేరే ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో ఉంటున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో బయట పడింది. గ్రేటర్ పరిధిలో సుమారు 10 వేల నుంచి 15 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారులు నివసించకుండా ఖాళీగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరికొందరు తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులకు అద్దెకు ఇవ్వడం, విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కూడా అధికారులు గుర్తించారు. ప్రభుత్వ పథకం ద్వారా వచ్చిన ఇళ్లను ఈ విధంగా వినియోగించడంపై గతంలోనే హెచ్చరికలు జారీ చేశారు. ప్రతాప సింగారం వంటి ప్రధాన డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో ఇళ్లు పొంది ఏడాది దాటినా నివాసం ప్రారంభించని వారిని గుర్తించి తాజాగా ఫైనల్ నోటీసులు జారీ చేశారు. నోటీసు అందుకున్న వారు నిర్దేశిత గడువులోగా ఇంట్లోకి మారాలని అధికారులు స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత కేటాయింపును రద్దు చేసి, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించనున్నారు.

## ప్రేమ విఫలమై.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో దారుణం జరిగింది. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్ నిభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. లవ్‌ఫెయిల్యూర్‌నే బలవన్మరణానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్న నిభాష్ (25) పెట్ల బుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో నిభాష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు ఈ విషయాన్ని వాట్సాప్‌లో తన స్నేహితులకు సమాచారం అందించాడు. అయితే ఉదయం స్నేహితులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా.. నిభాష్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిమ్స్ వైద్య సిబ్బందికి బెదిరింపులు
## భద్రతా సిబ్బందిపై దాడి

**జూబ్లీహిల్స్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** నిమ్స్ అత్యవసర విభాగంలోని రెడ్ ట్రయాజ్ ప్రాంతంలో వైద్య సిబ్బందిపై దుర్భాషలు, బెదిరింపులకు పాల్ప డటంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి జరిగిన ఘటనను నిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఓ రోగిని అత్యవసర విభాగానికి తీసుకు రాగా, విధుల్లో ఉన్న వైద్యులు తమ బాధ్యతలను నిర్వహించారని ఆర్డీఏ తెలిపింది. అయితే రోగితో వచ్చిన వ్యక్తి వైద్యులు, సిబ్బందిని దుర్భాషలాడుతూ బెదిరించడంతో పాటు రాజకీయ పలుకుబడి, ముఖ్యమంత్రితో పరిచయం ఉందంటూ బెదిరించినట్లు పేర్కొంది. అనంతరం ఆసుపత్రి మొదటి అంతస్తులో విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందిపై భౌతికంగా దాడి చేసినట్లు తెలిపింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, సీసీ టీవీ దృశ్యాలను భద్రపరచాలని, బాధ్యులపై పోలీసు, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఏ డిమాండ్ చేసింది.

**నర్సుహత్యకేసులో నిందితుడిని శిక్షించాలి**

**సైఫాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో ప్రైమ్ కేర్ మల్టీ సుపార్ స్పెషాలిటి హాస్పటల్‌లో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతి శిరీషాను హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.



పైలెట్ రోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

## చెన్నకేశవస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

..భక్తి, ఐకమత్యంతో గ్రామాభివృద్ధి సాధ్యం

..మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** భక్తి, ఐకమత్యంతో గ్రామాభివృద్ధి సాధ్యమని, శ్రీ వెంకట చెన్నకేశవస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో నిర్వహించిన శ్రీ వెంకట చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు కేవలం అద్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా ప్రజల్లో నైతిక విలువలు, ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొందించే పవిత్ర ప్రదేశాలని అన్నారు. గ్రామ ప్రజలు కుల, మత భేదాలకు అతీతంగా ఐకమత్యంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విగ్రహ ప్రతిష్ట గ్రామ ప్రజలందరికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిఎల్‌డిఏ చైర్మెన్ పి.నారాయన్‌రడెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవింద్రచారీ, వీరప్ప, మాజీ యంపిటిసిలు వెంకటేష్‌చారీ, తిప్పన్న చారీ, ఉపసర్పంచ్ ఎల్లప్ప, నాయకులు మహిపాల్‌రెడ్డి, ముస్తఫా, వీరేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.




పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

## విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ చదువు బలమైన పునాది

..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 31,ప్రభాతవార్త:** విద్యార్థుల భవిషత్తుకు ఇంటర్ చదువు బలమైన పునాదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల వెల్‌కమ్ పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరై, విద్యార్థులను ఉద్దేశించిన మాట్లాడుతూ కళాశాల అంటె రంగుల ప్రపంచం, ఇక్కడ కులాలకు, మతాలకు చోటు లేదని అన్నారు. మనుషులను కలిపే స్వచ్చమైన స్నేహం,ఆత్మీయతల బందాలే ఉంటాయని అన్నారు. ఇక్కడ ఏర్పడే సేన్యాలు జీవితాంతం గుర్తిండిపోతాయని అన్నారు. అందుకే ఆ కళాశాల జీవితాన్ని కేవలం చదువుకే పరిమితం చేయకుండా, మంచి స్నేహలు, మంచి ఆలోచనలు, మంచి జ్ఞాపకాలతో జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మీ కోసం ఎన్నో త్యాగాలు చేస్తున్న తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించండని అన్నారు. మీరు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన మిమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చిన తల్లిదండ్రులను ఎప్పటికి మర్చి పోవద్దని అన్నారు. ప్రతిరోజు కనీసం కొంత సమయం మీ లక్ష్యం కోసం కేటాయించాలని అన్నారు. మనందరికి రోజుకు 24 గంటలే, గొప్ప వ్యక్తికి కూడా 24 గంటలే, సాధారణ వ్యక్తికి కూడా 24 గంటలే, కాని ఆ 24 గంటలనె ఎవరైతే అద్బుతంగా ఉపయోగించుకుంటారో, వారే జీవితంలో గొప్ప స్థాయికి చేరుకుంటారని అన్నారు. అందుకే సమయాన్ని వృథా చేయకుండా, చదువుకు మంచి ఆలోచనలకు, మీ భవిషత్తుకు కోసం సమయం కేటాయించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కళాశాల ఉపాద్యాయ బృందం, నాయకులు, విద్యార్థులు పాల్గొనాలని అన్నారు.



### సంచార జాతుల అభివృద్ధికి
## ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

**జవహర్‌నగర్, ఆగస్టు31, ప్రభాతవార్త:** సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేంద్ర, సంచార జాతుల బోర్డు మాజి చైర్మన్ బికు రాంజీ ఇదతే కోరారు. సంచార జాతులకు స్థిర నివాసం కల్పించి పక్క ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వారి సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. జవహర్‌నగర్ దేవేందర్‌నగర్‌లోని వడ్డే ఓబన్న విగ్రహ ప్రాంగణంలో సోమవారం 75వ సంచారజాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈసందర్బంగా బికు రాంజీ ఇదాతే వడ్డేఒబ్బన్న విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంచార జాతుల పిల్లలకు మంచి విద్య అందించేందుకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్ర మహేష్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక కళా విభాగం అఖిలభారత కన్వినర్ అప్పల ప్రసాద్, స్వర్ణకుమార్, చిరంజివి, దుర్గేష్, రాము, మల్లేష్, రాజన్, షిండే, సువిర్‌జి, తదితరులు పాల్గోన్నారు,

## ధారూర్‌లో తూతూ మంత్రంగా ప్రజావాణి

.. అధికారుల గైర్హాజరుతో నిరాశగా వెనుదిరుగుతున్న అర్జీదారులు



డి ఆర్ ఆర్, పి 03 ప్రజావాణిలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

**ధారూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ధారూర్ మండలంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖిప్రజావాణిఖి కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత గల అధికారులు, ఇక్కడ మొక్కుబడి వ్యవహారంగా మారుస్తున్నారన్న విమర్శలు తీవ్రమవుతున్నాయి. సోమవారం ధారూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి చాలా మంది ప్రధానాధికారులు హాజరుకాకపోవడం గమనార్హం. కొద్దిపాటి అధికారులు మాత్రమే వచ్చి, ఫోటోలకు ఫోజులిచ్చి వెంటనే వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. మరికొన్ని శాఖల అధికారులైతే అసలు రాకుండా తమ కింది స్థాయి సిబ్బందిని మాత్రమే పంపి చేతులు దులుపుకుంటున్నారు.

దూరప్రాంతాల నుండి తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించుకోవడానికి ఎంతో ఆశతో వస్తున్న అర్జీదారులు, ప్రజావాణికి అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రజలకు చేరువ కావాలని భావిస్తుంటే, క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు మాత్రం ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ తంతుపై స్పందించి, ప్రజావాణికి గైర్హాజరవుతున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ధారూర్ మండల ప్రజలు కోరుతున్నారు.

## అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమఫలాలు

..ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం

..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**పెద్దేముల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అర్హులైన పేద కుటుంబాలకు డిజిటల్ రేషన్ కార్డులు అందించడం సంక్షేమ పాలనలో కీలక అడుగని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ అధ్వర్యంలో సోమవారం పెద్దేముల్ మండలం కందనెల్లి జీపిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణికి ఎమ్మెల్యే హజరై రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిజిటల్ వ్యవస్థ ద్వారా అవకతవకలకు అడ్డుకట్ట వేసి, సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. డిజిటల్ విధానం ద్వారా పారదర్శకత పెరిగి, అర్హులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా చేరుతాయని అన్నారు. కార్డులు అందని వారి సమస్యలను అధికారులకు దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, మాజీ డిసిసిబి చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయన్‌గౌడ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి, యంపిడిఓ తిరుమలస్వామి కందనెల్లి సర్పంచ్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



**కొడంగల్, అగష్టు 31, ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని పలు ఫర్టిలెజర్ దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సుమారు 10 మంది అధికారులు మూడు బృంధాలుగా ఏర్పడి పలుదుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.

ఫోటోవార్త: కెడిఎల్ 1పిహెచ్: కొడంగల్‌లో ఫర్టిలెజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఈ సందర్బంగా రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలతో పాటు దుకాణ యజ మానులు రైతులపట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ ఇటీవలే ప్రసారమాధ్యమాల్లో రావడంతో అధికారులు స్పందించినట్లు తెలుస్తుంది.

ఈ క్రమంలో రైతుల నుండి వివరాలు సేకరించినట్లు సమాచారం. సాయంత్రం నుంచి కొనసాగుతున్న అధికారుల తనిఖీలు రాత్రి వరకు కొనసాగుతున్నాయి. పూర్తి వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

## క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం

అంతర్ పాఠశాల క్రీడా పోటీల్లో 11 పాఠశాలల విద్యార్థులు




**జవహర్‌నగర్, అగష్టు 31, ప్రభాతవార్త:** క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయెగపడుతాయాని కాప్రా మండల విద్యాశాఖ అధికారి ఎం.డి.అజముద్దీన్ అన్నారు.

జాతీయా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జవహర్‌గనర్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాల క్రీడా పోటిలు నిర్వహించారు. పోటీల్లో జవహర్‌గనర్ పరిధిలోని 11పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలిబాల్ తదితర పోటిలు నిర్వహించారు. బాలికల ఖోఖో, కబడ్డితోపాటు బాలుర వాలీబాల్‌లో ఝూన్సీ, సరస్వతి విద్యానికేతన్ ప్రతిభ కనబరిచింది. బాలుర కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ బాలాజీనగర్ విజేతగా నిలిచింది. విజేతలు, రన్నరప్‌లను నిర్వాహకులు అభినందించారు. ఈకార్యక్రమంలో ఝూన్సి సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్ యాదవ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన రోడ్డుసౌకర్యాలు కల్పించటానికి కృషిచేస్తా



లాల్‌గడిమలక్‌పేటలోని 15వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన చేసిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న వైస్‌చైర్మన్,కమిషనర్, కౌన్సిలర్ల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించటానికి కృషి చేస్తున్నట్లు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల గడిమలక్ పేట్‌లో (15వ వార్డు) సిసి రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి వైస్‌చైర్మన్ కె.మాలతి మాదవరెడ్డి, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి స్థానిక కౌన్సిలర్లతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. అలియాబాద్ మున్సిపల్ జనరల్ నిధుల నుంచి 8లక్షల రూపాయలు 15వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణంకు మంజూరు పొంది నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు తాళ్ల స్వప్నరాంప్రసాద్, కైర గణేశ్, తలారి మౌనిక బాబు, మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఎఇఇ షాహిన్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పుష్పాలతో అలంకరించిన కోనాయిపల్లిలో పెద్దమ్మ తల్లి ముఖచిత్రం

## భక్తి, విశ్వాసాలకు ప్రతిరూపం కోనాయిపల్లి పెద్దమ్మ తల్లి

**కేశంపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో గ్రామదేవతల ఆరాధనకు ప్రత్యేకస్థానం ఉంది. ప్రజల ఆచారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలతో ముడపడి ఉన్న అమ్మవార్లలో పెద్దమ్మ తల్లికు విశిష్టమైన స్థానం ఉంది. కేశంపేట మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామంలో భక శ్రద్ధలతో రూపొందించిన పెద్దమ్మతల్లి పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకటుకుంటోంది. వేలాది పసుపు, పచ్చని పుష్పాలతో రూపొందించిన అమ్మవారి ముఖచిత్రం ఆధ్యాత్మిక భావనను కలిగిస్తోంది. నుదుటిపై కుంకుమ, కళ్లు, ముక్కు, పెదవులను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి రూపాన్ని పుష్పాలతో సృజనాత్మకంగా ఆవిష్కరించారు. పుష్పాలతోనే అమ్మవారి ముఖాన్ని తీర్చిదిద్దడం భక్తుల కళాభిమానానికి, అమ్మవారిపై ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. పెద్దమ్మ తల్లి అంటే గ్రామానికి పెద్దతల్లి అనే భావనతో అనేక ప్రాంతాల్లో ప్రజలు అమ్మవారిని గ్రామ రక్షకదేవతగా కొలుస్తుంటారు. పండుగలు, బోనాలు, జాతరలు, ప్రత్యేక పూజల సమయంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం తెలంగాణ గ్రామీణ సంస్కృతిలో కనిపించే సంప్రదాయం. కోనేపల్లి పెద్దమ్మ తల్లి పుష్పాలంకరణలో పసుపు రంగు పుష్పాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి ముఖంలో ప్రశాంతత, భక్తిభావం ప్రతిబింబించేలా పుష్పాలతో చేసిన ఈ అలంకరణ చూపరులను ఆకట్టుకుంటోంది. గ్రామస్తులు, భక్తులు ఈ అమ్మవారి రూపాన్ని దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నారు. భక్తుల విశ్వాసానికి, గ్రామీణసంప్రదాయాలకు ప్రతీకగా కోనాయిపల్లి పెద్దమ్మ తల్లి రూపం నిలుస్తోంది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని బోనాల పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ చొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ ముదిరాజ్ అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వార్డు సభ్యులు

## దొంగతనం కేసులో నిందితుడి ఆరెస్ట్

-- బంగారు ఆభరణాలు స్వాధీనం




నిందితున్ని అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడిస్తున్న సిఐ

**తాండూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాల్మీకి నగర్‌లో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై పనిమనిషి భర్త అతని స్నేహితుడితో కలిసి దాడి చేసి ఆమె మెడలోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలో పోలీసులు ఓ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా.. అతని స్నేహితున్ని అదుపులోకి తీసుకొని బంగారు ఆభరణాలు స్వాదీనం చేసుకున్నారు. సోమవారం పట్టణ సీఐ పరమేశ్వర్‌గౌడ్ కేసు వివరాలను వెల్లడించారు. గత రెండు రోజుల క్రితం పట్టణంలోని వాల్మీకినగర్‌లో నివాసముంటున్న ఉమాదేవి ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన ఇంటి పనిమనిషి భర్త మొగులప్ప ఆమెపై దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈ ఘటనలో ప్రధాని నిందితుడు మొగులప్పతో పాటు అతని స్నేహితుడు సంజీవ్ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం సుమారు 10గంటల సమయంలో పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలో పోలీసులు సంజీవ్‌ను అదుపులోకి తీసుకుని .. చోరీ సొత్తును స్వాదీనం చేసుకున్నట్లు సీఐ పరమేశ్వర్‌గౌడ్ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మొగులప్ప పరారీలో ఉన్నట్లు తెలిపారు. సంజీవ్‌ను న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధిచినట్లు వివరించారు. పరారీలో ఉన్న మొగులప్ప కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకొని ఆభరణాలను రికవరి చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

## సమాజసేవలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయం

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



తాళ్లపల్లిలో డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ

**షాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** సమాజ సేవలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. విద్యార్థులను సమాజాభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. సోమవారం షాబాద్ మండలం తాళ్లపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది బాధ్యత, సేవతో పాటు ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తరమైన అవకాశమని అన్నారు. ఈ బాధ్యతను డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వర్తించారని కొనియాడారు. పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బోధించడంతో పాటు జీవితంలో ఎలా ముందుకు సాగాలి, కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, మంచి మనిషిగా ఎలా ఎదగాలనే విలువలను విద్యార్థులకు నేర్పించారని గుర్తుచేశారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉండటం ఆయన సేవకు గొప్ప గుర్తింపు అని అన్నారు. ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ చేసినప్పటికీ ఉపాధ్యాయుడిగా విద్యార్థులపై ఆయన చూపిన ప్రభావానికి మాత్రం పదవీవిరమణ ఉండదన్నారు. ఆయన నాటిన జ్ఞానపు విత్తనాలు విద్యార్థుల జీవితాల్లో ఎప్పటికీ ఫలాలను అందిస్తూనే ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యం చేయాలి






తూంకుంటలోని విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సిఐలు పవన్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న జానకి రాములు, ఎస్ఐ నవీన్‌రెడ్డి, కరస్పాండెంట్ హనుమంతరెడ్డి విద్యార్థుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 31, ప్రభాతవార్త** తూంకుంటలోని హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొని అవగాహన కల్పించారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని విజ్ఞాన్ భారతి హైస్కూల్‌లో ట్రాఫిక్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి, సిఐ జానకి రాములు, ఎస్ఐ నవీన్‌రెడ్డిలు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్స్ ఖచ్చితంగా ధరించాలని, కారు వాహనదారులు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. రోడ్డుపై వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్లు మాట్లాడవద్దని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పాఠశాల కరస్పాండెంట్ గోనె హనుమంతరెడ్డి, జంగారెడ్డి, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ షూస్ పంపిణీ

..మేడ్చల్ జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి




శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్,షూస్‌ను పంపిణీ చేసిన జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్, పలువురు నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 31, ప్రభాతవార్త** శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్‌ను, షూస్‌ను మేడ్చల్ జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. సోమవారం శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్‌ను, షూస్‌ను పలువురు నాయకులతో కలిసి జైపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరు కావాలని, మంచిగ చదువుకోవాలని జైపాల్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం యూనిఫామ్స్, మధ్యాహ్నభోజనం, పుస్తకాలు అందజేస్తుందని విద్యార్థులు బాగ చదువుకోవాలని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాద్యాయులు శంకర్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆ తరువాత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ మెను ప్రకారం నాణ్యమైన రుచికరమైన బోజనం అందించాలని జైపాల్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. దీనిలో ఆయనతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఇ.జ్యోతి, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్, మాజీ ఎంపిటిసి డి.సాయిబాబు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, విలాసాగరం అశోక్, మేకల అంజనేయులు, సోగడి బాల్‌రాజ్, బిక్షపతి, కె.బాల్‌రాం, ఎస్.శ్రీనివాస్, బి.వెంకటేశ, ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్, వి.బుచ్చిబాబు, ఎ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, నాయకులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా

**పెద్దేముల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** వెంకట చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం గాజిపూర్‌లో వెంకట చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, మాజీ డిసిసిబి చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, మాజీ డిఎల్‌డిఎ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, సర్పంచ్ హేమలత లాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి, నాయకులు నసీర్, లాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అవుసలి రవి, వేణుగోపాల్‌రెడ్డి నాగార్జునరెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

# పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

**నందిగామ, ఆగస్టు 31, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసిందని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం నందిగామ మండలానికి చెందిన వడ్ల వెంకటాచారికి రూ.2 లక్షలు, బండారు గీతాంజలికి రూ.18,500 లు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు, అట్టడుగు వర్గాల ప్రజలకు అత్యవసర సమయాల్లో తక్షణ ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదు కోవడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి చెక్కులను పొందిన లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , సర్పంచ్ కొమ్ము కృష్ణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, మాజీ ఎంపిటిసి చంద్రపాల్ రెడ్డి,ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల ప్రవీణ్, శివవగళ్ల సురేష్, బొమ్మగళ్ళ నర్సింలు, చించేటి లతా శివకుమార్, కిట్టు నాయకులు ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, అన్వర్ పాష ,చించేటి కృష్ణ, కేశమోని రామచంద్రి, నరేందర్ రెడ్డి, చేన్నగళ్ళ జంగయ్య, తడకల జంగయ్య, అభిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటచారికి సిఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

# మొక్కల పెంపకం, సంరక్షణలో.. సిడితాండ రికార్డ్

**ప్రగతి వైపు దూసుకెళ్తున్న సిడితాండ నర్సరీ**

**సుమారు 32వేల మొక్కల పెంపకం ఆదర్శం.. అభినందనీయం**

**నందిగామ, ఆగస్టు 31, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆయా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల ద్వార పెంచిన మొక్కలు మంచి ఫలితాన్ని ఇస్తున్నాయి. నందిగామ మండలం సిడితండా సర్పంచ్ గబ్రు చౌహాన్ ఆధ్వర్యంలో సిడి తాండ పంచాయతీ కార్యదర్శి రవీందర్ ప్రత్యేక శ్రద్ధతో నర్సరీలో ప్రాణవాయువు ఇచ్చే మొక్కలే కాకుండా పండ్ల మొక్కలను పెంచి పరిసర ప్రాంతాల్లో నాటడమే కాకుండా అడిగిన వారికి కూడ పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే డూప్స్ గార్డెన్ లో, ఆర్కే వెంచర్లో,పిసిఆర్ వెంచర్ పది శాతం భూముల్లో, అవెన్యూ(రోడ్డు ఇరువైపుల),ఇంటర్నల్ ప్లాంటేషన్ , కమ్యూనిటీ ప్లాంటేషన్ సుమారు 32 వేల మొక్కలు నాటి సంరక్షి స్తూ రికార్డ్ సృష్టించారు. కాలుష్య రహిత సమాజం కోసం, అందరి ఆరోగ్యం కోసం సర్పంచ్ పాలకవర్గం,పంచాయతి కార్యదర్శి, సిబ్బంది చేస్తున్న కృషిని పలువురు



సిడి తండా నర్సరీ నుంచి మొక్కలు తీసుకెళ్తున్న సిబ్బంది

# యాచారంలో ఘనంగా బోనాలు



బోనాల పండుగ ఉత్సవాలలో గ్రామస్తులు

**యాచారం ఆగస్టు31, ప్రభాతవార్త:**

యాచారం మండల కేంద్రంలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మస్కు అనిత శరణం ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈ సాంప్రదాయ పండుగలో స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించిన బోనాల ఘటాలను నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలతో యాచారం పురవీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారాయి. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు.

## శక్తి స్కీమ్ జీవో97ను వెంటనే రద్దు చేయాలి

**విద్యార్థి సేన అధ్యక్షులు టి.కె. శివప్రసాద్ డిమాండ్**

**షాద్‌నగర్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** శక్తి స్కీమ్‌లో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి సంబంధించిన జీవో97ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సేన అధ్యక్షులు టి.కె. శివప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ విద్యార్థి సేన కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా టి.కె. శివప్రసాద్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా దశాబ్దాలుగా విజయవంతంగా కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యథాతథంగా బలోపేతం చేయకుండా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం ఎవరి ప్రయోజనం కోసం అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. గత రెండు వారాలుగా వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడం సరికాదన్నారు. తెలంగాణలో సుమారు 60 పాలిటెక్నిక్ కళాశాలలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపాధికి ఉపయోగపడే వివిధ సాంకేతిక కోర్సులను అందిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, కళాశాలల మౌలిక వసతులు, ల్యాబ్‌లు, హాస్టళ్లు, నిధులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన విలువైన భూములపై ప్రభుత్వం దృష్టి సారించిందనే అనుమానాలు విద్యార్థుల్లో ఉన్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే జీవో97ను ఉపసంహరించుకుని పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు విద్యార్థి సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రిషబ్ జైన్, హైదరాబాద్ అధ్యక్షులు చింతల పవన్, షాద్‌నగర్ శాఖ అధ్యక్షులు నర్సింహా ముదిరాజ్, పరమేశ్వర్, బాలు, రాజు, రాంమోహన్ రెడ్డి, చింటూ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రవీందర్ యాదవ్

**రాంనగర్ కాలనీలో ఘనంగా**

## శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి మహోత్సవం

**షాద్‌నగర్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి ధ్వజారోహణ మరియు బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారంగా రూ.50,000 విరాళాన్ని రవీందర్ యాదవ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాంనగర్ కాలనీపై శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి ంచారు. మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, కాలనీ ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాణి పాండు రంగారెడ్డి, వసంత శ్రీనివాస్, శారద శేఖర్, మహమ్మద్ ఎజాజ్ (అద్దు), ఎస్పీ శివ, సర్పంచ్ వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, వెంకట్రాం రెడ్డి, కానుగు అంతయ్య, నందకిషోర్, జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, శ్రీపాల్ రెడ్డి, బాలాజీ, ఆనంద్, బాలు యాదవ్, సంతోష్, భువనేశ్వర్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, శివ, రాము నాయక్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చటాన్‌పల్లిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**షాద్‌నగర్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు చటాన్‌పల్లిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. 3వ వార్డు కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు. చటాన్‌పల్లి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి చేపడుతున్న పనుల్లో భాగంగా అండ ర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానికులు, నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేపర్ శివ, వెంకట్ రెడ్డి, నర్సింహులు, దర్శన్, మహేష్ మాల, శ్రీరామ్, మహేష్ గౌడ్, శేఖర్, జంగయ్య, విక్రమ్ రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీరాములు, వినోద్, దేవగిరి రామకృష్ణ, భాస్కర్ గౌడ్, ప్రకాష్, రమేష్, రవీందర్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రశాంత్, హరీశ్వర్ రెడ్డి, చందు యాదవ్, కుమార్, నాని, కార్తిక్, రాకేష్, ప్రేమ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపన పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

## రేపు జోనల్ క్రికెట్ ఎంపికలు

ఘట్‌కేసర్, ఆగస్టు 31, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ జోనల్ క్రికెట్ పోటీల ఎంపికలు ఈనెల 2, 3 తేదీలలో నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి ఎపిఎం.విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోడుప్పల్‌లోని ఎస్‌కెఎస్ క్రికెట్ అకాడమీలో బుధ, గురువారాల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేస్తామని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ జోనల్ అండర్ 14, అండర్ 17 క్రికెట్ సెలక్షన్స్‌కు సంబంధించి మేడిపల్లి, ఘట్‌కేసర్ మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే క్రికెట్ క్రీడాకారులు ఈక్రికెట్ సెలక్షన్లో పాల్గొనాలని జోనల్ సెక్రెటరీ విద్యాసాగర్ తెలిపారు.



# మల్లారెడ్డిగూడలో ఘనంగా బోనాలు

**షాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. పోచమ్మ, మైసమ్మ ఆలయాలను విద్యుత్ కాంతులతో సుందరం గా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పుదరువుల మధ్య పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు చల్లంగా ఉండాలని వర్గాలు సకాలంలో కురిసి పాడిపంటలు సంవృద్ధిగా పండాలని మె ఎక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు అమీర్పేట్ సబితాగోవర్ధన్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం

**బంట్వారం, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక మహిళా ప్రయాణికులు తెగ ఇబ్బందులు పడేవారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత గ్రామ సర్పంచ్ మల్లేశం ఆధ్వర్యంలో ఆ సమస్యకు తెరపడనుంది. బంట్వారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించేందుకు స్వచ్ఛ భారత్, గ్రామ పంచాయితీ నిధుల కింద రూ.3.50 లక్షలు మంజూరు చేయడం జరిగింది. ఇందులో భాగంగా సోమవారం మరుగుదొడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ డి.మల్లేశం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ, గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మల్లేశం, ఎంపీడీఓ రాములు

## మన నేచురల్ డైరీ ప్రారంభం

**చేవెళ్ల, ఆగస్టు 31, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపాలిటీ లోని చేవెళ్ల విలేజ్ రోడ్డు పోస్ట్ ఆఫీస్ పక్కన మన నేచురల్ డైరీ షాప్ నూతనగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చేవెళ్ల చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ 15వ వార్డు కౌన్సిల్ శైలజ ఆగిరెడ్డి, మన నేచురల్ డైరీ షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మన నేచురల్ డైరీ షాప్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయ వంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో బండారి శైలజ ఆదిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నేచురల్ డైరీ ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

## తూంకుంటలో ముగిసిన శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

**శామీర్‌పేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** తూంకుంటలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ప్రత్యేక పూజలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో శ్రీరాఘవేంద్రస్వామి 355వ ఆరాధన ఉత్సవాలు కన్నుల పండుగగా ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త డాక్టర్ ఎస్‌విఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు నుంచి వేద బ్రాహ్మణులు పాల్గొని పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనం నడిపే వారిపై ఉక్కుపాదం

**యాచారం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్యపానం చేసి వాహనం నడిపి పట్టుబడిన వారి పై కఠినంగా వ్యవహరిస్తున్నారు.మద్యం సేవించి వాహనం నడిపిన ఒక వ్యక్తికి ఇబ్రహీంపట్నం కోర్టు 1 రోజు ట్రాఫిక్ డ్యూటీతో పాటు రూ. 6,000 జరిమానా విధించింది.పోలీసుల వివరాల ప్రకారం.. యాచారం మండలం బస్ స్టాప్ వద్ద ఆగస్టు 28న యాచారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇబ్రహీంపట్నం మండలం ఖానాపురం గ్రామానికి చెందిన సుందర్ రావు (47, ప్రయివేట్ డ్రైవర్) మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి ఆగస్టు 31న ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపరిచారు.

కేసును విచారించిన గౌరవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సుజాత గారు, మోటార్ వాహనాల చట్టం 185(ఏ) సెక్షన్ కింద నిందితుడికి 1 రోజు ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించడంతో పాటు రూ. 6,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఈ సందర్భంగా యాచారం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నందేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్ల ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే ఇతర అమాయకుల ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలి. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు.

## ఎన్ఎన్ఆర్ యువసేన ఫలహారం బండి ఊరేగింపు

**యాచారం ఆగస్టు31, ప్రభాతవార్త:**

యాచారం మండ పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఎన్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో బోనాల అనంతరం ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా సోమవారం నిర్వహించారు. ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్‌పర్సన్ నాయినిలహరి నవీన్‌రెడ్డి నాయకత్వంలో ఈ వేడుకలు విజయవంతంగా పూర్తయ్యాయి.

గ్రామ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ఫలహారం బండి కార్యక్రమానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ,గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ,యువతను సేవా దృక్పథంతో ముందుకు నడిపించడమే తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు మరియు ఎన్ఎన్ఆర్ యువసేన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని వినతి

**చేవెళ్ల, ఆగస్టు 31, ప్రభాతవార్త :** 58 సంవత్సరాలు పైబడిన అర్హులైన వృద్ధులకు కొత్తగా వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం 58 సంవత్సరాలు పైబడిన అర్హులకు వృద్ధాప్య పింఛన్లు అందిస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు కొత్త పింఛన్ల మంజూరుపై స్పష్టత లేకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పింఛను కోసం అర్హులైన వృద్ధులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎదురుచూస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం చేయూత పథకం కింద వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు తదితర అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, అదే విధంగా 58 సంవత్సరాలు పైబడిన అర్హులైన వృద్ధుల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించి, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వృద్ధుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే అందించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు దేవుని ఎర్రవల్లి కౌన్సిలర్ మీనాక్షి సత్యనారాయణ చేవెళ్ల మున్సిపల్ జనరల్ సెక్రటరీ పత్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పిసరి శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ నాయకులు గుడుపల్లి మధుసూదన్ రెడ్డి సామ కృష్ణారెడ్డి, జయసింహా రెడ్డి,శ్రీకాంత్, కరుణాకర్, కరికే రవి, గణేష్, పాగా వెంకటేష్, రాజు, చంద్రయ్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలి

**షాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ పామెన భీంభరత్ అన్నారు. సోమవారం షాబాద్ లో ఓ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా గుడుపల్లి పెంటారెడ్డికి సన్మాన సభ, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయా లన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి కార్యకర్తలను సమ న్వయం చేసుకుంటూ ముందుకు సాగా లన్నారు. నూతనంగా ఎన్నికైన పెంటారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి బాధ్య తలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.



షాబాద్‌లో సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

ఈ కార్యక్రమంలో సర్దార్నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గారి సతీష్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, సర్పంచులు అశోక్, సబితాగోవర్ధన్ రెడ్డి, పామెన నర్సింహులు, మాజీ జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, నాయకులు రాఘవరెడ్డి, యాదయ్య, రవీందర్, అశ్వశీలీ, చెన్నయ్య, రాంరెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్రెడ్డి, సున్నం వసంతం, మాణయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవానికి రెడీ అయిన మహిళ సమైక్య భవనం





ప్రారంభానికి ముస్తాబైన మహిళ సమాఖ్య భవనం.

**నందిగామ, ఆగస్టు 31, ప్రభాతవార్త :** నందిగామ మండ్నల లోని సిడితండా గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎఫ్ ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనం నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. సర్పంచ్ గబ్రు చౌహాన్, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్ , వార్డు సభ్యులు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు పాత్లావత్ శ్రీనివాస్, సభ్యులు దగ్గరుండి నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణ పనులు చేపట్టారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ మారుస్తూ కొత్తగా స్తంభాలను పునరుద్ధరించారు. అన్ని మౌలిక సదుపాయాలతో, పరిసరాలలో మొక్కలు నాటి ముస్తాబ్ చేశారు. గిరిజన మహిళలకు అందుబాటులో నిర్మించిన ఈ భవనాన్ని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభం జరగనుందని సర్పంచ్ గబ్రు చౌహాన్ తెలిపారు.

## విధినిర్వహణలో అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివి

**మోమిన్‌పేట్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** విద్యావ్యవస్థలో విద్యార్థులకు మొదటి మెట్టు ప్రారంభం అయ్యేదిది అంగన్‌వాడి కేంద్రాలద్వారా ప్రారంభమౌతుందని ప్రధనోపాధ్యాయులు మల్లేశం అన్నారు. సోమవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించిన ఉగ్గెల్లి అరుణ గత 30, సంవత్సరాలుగా అంకిత భావంతో పని చేస్తు బుజ్జి బుజ్జి చిన్నారులకు తమ నైపుణ్యాన్ని చిన్నారులకు విధ్యాబుద్దులు, ఆటాపాటలతో నేర్పిస్తూనే, ఓవక్క గ్రామంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లల తల్లులకు సమయానికి అవసరమైన పౌష్టికాహారం అందిస్తూ తమ జీవితమంతా ధరపోసిన అరుణ నేడు పదవి విరమణ పొందుతున్న సంధర్భంగా గ్రామస్తులంతా ఆనందభాష్పాలతో కన్నీరు మున్నీరయ్యారు. అదే విధంగా ఆమే వద్ద విధ్యనభ్యసించిన వారు చాలా వరకు నేడు ప్రభుత్వ, ప్రైవేటు పరంగా ఉద్యోగాలలో స్థిరపడ్డారు. అదే విధంగా స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు విట్టల్, జిల్లా స్థాయి నాయకుడు మధుసూధన్‌రెడ్డి ఆమెను ఘనంగా సన్మానించి వారు మాట్లాడుతు విద్యార్థులకు అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. అలాగే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవీకాలంలో విద్యార్థులకు, గర్భిణీ బాలింతలకు, అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, గ్రామ పదవిలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని వారన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మున్నూరు విట్టల్ నియోజకవర్గ నాయకుడు, మధుసూదన్ రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, బిఆర్ఎస్ బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు భూమొల్ల కృష్ణయ్య ,యువ నాయకుడు నరహరి, విద్యా కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు, గ్రామపెద్దలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మహదేవ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంచంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ జనార్ధన్, వార్డు సభ్యులు రఘుపతిచారి, ప్రవీణ్ కుమార్, నర్సింలు, జగదీశ్వర్, రాంచంద్రయ్య, పర్మారెడ్డి, జానిమియా, అంగన్వాడి సూపర్వైజర్ పుష్పలత, వైష్ణవి, వివిధ గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, యువకులు, పదవి విరమణ పొందిన అరుణ కుటింబీకులు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాలకు వైద్యులను నియమించండి

**ఘట్‌కేసర్, ఆగష్టు 31, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్, బాలాజీనగర్‌లలోని బస్తీ దవాఖానలో వైద్యులను నియమించాలని కోరుతూ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో డిఆర్ఓ మాలతీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆనంద్‌ని కలిసి విజ్ఞప్తి చేయగా రెండు వారాల్లో బస్తీ దవాఖాలకు వైద్యులను నియమించ నున్నట్లు హమీ ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ రైతుబంధుసమితి మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.